
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 6 | అక్టోబర్ | 2024



పండుగకూ పస్తులేనా..?

సద్దుల బతుకమ్మ, దసరా పండుగలు సమీపి స్తున్నా పెండింగ్ బిల్లులు అందకపోవడంతో అంగన్‌వాడీలు ఇబ్బంది పడుతున్నారు. 8లో



సింగరేణి జీఎంల బదిలీ

సింగరేణిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆరు గురు జీఎంలను బదిలీ చేస్తూ యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. ఉదయం ప్రారంభమైన ఎండ మధ్యాహ్నానికి మరింతగా పెరుగుతుంది.

నిరీక్షణ ఎన్నాళ్లో ?

నష్ట పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు

- భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న పంటలు
- పరిహారం ఇస్తామన్న సీఎం హామీతో ఆశలు
- నెల దాటినా అందలేదంటున్న రైతులు



బూర్గంపాడు మండలంలో వరదలతో దెబ్బతిన్న పత్తి చేను(ఫైల్)

బూర్గంపాడు: జిల్లాలో సెప్టెంబర్ మొదటి వారంలో వచ్చిన భారీ వర్షాలు రైతులను అతలాకుతలం చేశాయి. ఈ వరదలతో వేల ఎకరాల్లో పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. భారీగా పెట్టుబడి పెట్టిచ మూడు నెలల పాటు రేయింబవళ్లు శ్రమించిన రైతులు.. పంట నష్టం జరగడంతో కుదేలయ్యారు. భారీ వర్షాలు పత్తి, వరి, మిర్చి, కూరగాయల పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. వరదలకు భూములు కోతకు గురయ్యాయి. ఇసుక మేటలు వేసి కొన్ని చోట్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరదల్లో రైతులు, పశువుల కాపరులు గల్లంతై మృతిచెందిన ఘటనలు కూడా ఉన్నాయి. పశువులు, జీవాలు కొట్టుకుపోయాయి. వరద పరిస్థితులను గమనించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పంట నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు తక్షణమే రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించారు. మృత్యువాత పడిన పశువులకు రూ 50 వేలు చొప్పున, జీవాలకు రూ. 5 వేల చొప్పున అందజేశారు. కానీ పంటలకు నష్ట పరిహారం చెల్లించే విషయంలో మాత్రం జాప్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్ హయాంలోనే పరిహారం..

పంటలు నష్టపోయిన రైతులు తిరిగి సాగు చేసేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున సాయం అందినా మళ్లీ పంటలు వేసేందుకు కొంత వెసులుబాటు ఉండేదని అంటున్నారు. గోదావరి వరదలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్ట పరిహారం అందిస్తామని ప్రభుత్వం చెబుతోందే తప్ప చెల్లించిన దాఖలాలు లేవు. 2006లో గోదావరి వరదలు, 2008లో అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నప్పుడు నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి మాత్రమే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద పంట నష్ట పరిహారం అందించారు. ఆ తర్వాత మరే ముఖ్యమంత్రీ పంట నష్టపరిహారం అందించలేదు. కాగా, ఇటీవలి వరదలతో పరిస్థితిని సమీక్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖమ్మం వచ్చిన సందర్భంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 10వేల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. దీంతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. అయితే పంట నష్టం జరిగి నెలరోజులైనా పరిహారం అందకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం స్పందించి త్వరగా పరిహారం అందించాలని వేడుకుంటున్నారు.

సాయమందిస్తే మళ్లీ సాగు చేస్తాం



వరదలకు పత్తి చేలు కోతకు గురయ్యాయి. రెండెకరాల్లో పంట పూర్తిగా దెబ్బతిన్నది. అధికారులు వచ్చి పంట నష్టాన్ని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. కానీ ఇప్పటివరకు పరిహారం అందలేదు. తొందరగా సాయం అందిస్తే మళ్లీ సాగు చేసుకునే అవకాశం ఉంటుంది.

– ఊడుగుల సత్యం, గొమ్మూరు

ఎకరాకు రూ. 30వేల నష్టం



భారీ వర్షాలు, వరదలతో పత్తి, వరి బాగా దెబ్బతిన్నాయి, ఎకరాకు రూ.30 వేల వరకు నష్టం వాటిల్లింది. పత్తి మొక్కలు వేర్లతో సహా కొట్టుకుపోయాయి. భూమి కోతకు గురైంది. ఆ భూమిని బాగు చేసి పంట వేయాలంటే ప్రభుత్వం పరిహారం అందించాలి.

– అవుల శ్రీనివాసరెడ్డి, రెడ్డిపాలెం

నివేదికలు పంపించాం



పంట నష్టానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించాం. రైతుల బ్యాంకు ఖాతాలు, భూముల వివరాలు, పంటనష్టం వివరాలను ఆన్‌లైన్ చేసి నివేదికలు అందించాం. తొందరలోనే పరిహారం అందే అవకాశాలు ఉన్నాయి.

– తాతారావు, ఏడీఏ, మణుగూరు

సంతానలక్ష్మిగా దర్శనం



సంతానలక్ష్మి అలంకరణలో మహాలక్ష్మీ దేవి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు సంతాన అవరోధాలను తొలగించే సంతాన లక్ష్మిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేయగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, సంతానం లేనివారు ఈ రూపంలో ఉన్న అమ్మవారిని కొలిస్తే పండంటి పిల్లలు జన్మిస్తారని భక్తుల నమ్మకం. దీంతో సంతానలక్ష్మి అమ్మవారిని సంతానంలో పాటు సుఖసంతోషాలు ప్రసాదించాలని వేడుకున్నారు. చిత్రకూట మండపంలో నిర్వహిస్తున్న శ్రీరామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేద పండితులు, అర్చకులు అయోధ్య కాండ పారాయణం చేశారు.

నేడు గజలక్ష్మిగా..

అమ్మవారిని గజలక్ష్మి రూపంలో ఉన్నప్పుడు ఆరాధిస్తే అధికారము, మహా సంపద కలుగుతాయని శాస్త్రం చెబుతోంది. గజలక్ష్మీ దేవిని ఆరాధించినందునే దేవేంద్రుడు త్రైలోకాధిపత్యాన్ని సాధించాడని పురాణంలో ఉందని, ఆ అమ్మను పూజిస్తే చెదరని అధికారం, తరగని సంపద కలుగుతాయని పండితులు అంటున్నారు.

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక శనివారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ ధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అన్నపూర్ణాదేవిగా పెద్దమ్మతల్లి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజైన శనివారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రాతఃకాలార్చన, శ్రీ లక్ష్మీగణపతి హోమం, వేదపారాయణం, నవగ్రహ జపాలు, శ్రీచక్రార్చన, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న అదనపు కలెక్టర్

పెద్దమ్మతల్లి అమ్మవారిని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఈఓ రజనీకుమారి అమ్మవారి శేషవస్త్రాలు అందజేశారు.

అన్నదానాన్నికి రూ.1,01,116 విరాళం

పెద్దమ్మతల్లి ఆలయంలో త్వరలో ప్రారంభించనున్న అన్నదాన కార్యక్రమానికి రాజమండ్రిలోని స్వరూప్‌నగర్‌కు చెందిన యడ్ల విజయరామారావు దంపతులు రూ.1,01,116 విరాళం అందజేశారని ఈఓ తెలిపారు. వారికి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందించారు.

లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా భానుమతి



భానుమతి



బత్తుల రామారావు

కొత్తగూడెంటౌన్: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా జి.భానుమతి పదోన్నతి పొందగా, అదే కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా ఉన్న బత్తుల రామారావు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా ఉద్యోగోన్నతి సాధించారు. ఈ మేరకు హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. భానుమతి గత రెండున్నరేళ్లుగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా ఉంటూనే జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టారు. రామారావు సైతం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టగా వీరిద్దరూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, జడ్జిలకు చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఊటుకూరి పురుషోత్తమరావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పట్టుపల్లి నిరంజన్‌రావు, మెండు రాజమల్లుతో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షులు తోట మల్లేశ్వరావు, ఎం.ఎస్.ఆర్.రవిచంద్ర, సాధిక్ పాషా, నల్లమల ప్రతిభ తదితరులు అభినందనలు తెలిపారు.

భద్రాచలం జడ్జి వికారాబాద్‌కు బదిలీ..

భద్రాచలం కోర్టులో ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటేశ్వర్లు సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది వికారాబాద్‌కు బదిలీ అయ్యారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



మ్యాచ్‌లో తలపడుతున్న నిజామాబాద్, మహబూబ్‌నగర్ జట్ల క్రీడాకారులు



ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

- జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్
- మ్యాచ్‌లలో హోరాహోరీగా తలపడిన ఉమ్మడి జిల్లా జట్లు

కొత్తగూడెంటౌన్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. కొత్తగూడెం సింగరేణి ప్రకాశం స్టేడియంలో అండర్–17 విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా యువజన, క్రీడల శాఖ మంత్రి ఎం.పరంధామరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పోటీలకు ఉమ్మడి 10 జిల్లాల నుంచి ఫుట్‌బాల్ క్రీడాకారులు తరలివచ్చారు. తొలిరోజు జరిగిన పోటీల్లో నిజామాబాద్ జట్టు 2–1 గోల్స్ తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో ఖమ్మం జిల్లా జట్టు నల్లగొండ జట్టును నిలువరించి 0–0 స్కోర్‌తో డ్రాగా ముగించింది. ఇంకో మ్యాచ్‌లో ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జట్లు చెరో గోల్ చేసి డ్రాగా ముగించాయి. నల్లగొండ నిజామాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నల్లగొండ జట్టు 3–0 గోల్స్‌తో విజయం సాధించింది. నవభారత్ స్కూల్ గ్రౌండ్‌లో జరిగిన ఇంకో మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుపై వరంగల్ జట్టు 3–1 గోల్స్ తేడాతో గెలిచింది. మెదక్ జట్టు 1–0 స్కోర్‌తో రంగారెడ్డి జట్టుపై ఓటమి పాలైంది. అనంతరం మరో మ్యాచ్‌లో మెదక్ జట్టు వరంగల్ జట్టుపై విజయం సాధించింది. కరీంనగర్, రంగారెడ్డి జిల్లా జట్ల మధ్య హోరాహోరీగా పోరు నెలకొనగా, మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఫుట్‌బాల్ పోటీలను వీక్షించేందుకు క్రీడాకారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నేను డిపెండర్‌ను !

ఫుట్‌బాల్ క్రీడ పోరాట పటిమతో ఆడే క్రీడ అని, తాను ఫుట్‌బాల్ ఆటలో డిపెండర్‌గా రాణించే వాడినని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఆయన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు మరింతగా రాణించి క్రీడల్లో దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ యువకులు క్రీడలతో పాటు విద్యలోనూ రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల పరిశీలకులు వడ్డెన్న, జిల్లా పాఠశాలల క్రీడల నిర్వాహక కార్యదర్శి వాసిరెడ్డి నరేష్‌కుమార్, బట్టు ప్రేమ్‌కుమార్, యనమదల వేణుగోపాల్, సీహెచ్ యుగంధర్, జనక్‌సింగ్, పి.విద్యాసాగర్, కవిత, స్టెల్లా, సుజాత, సీతాదేవి, రాములమ్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షిద్దాం



క్రీడాకారులతో వనజీవి రామయ్య

చంద్రుగొండ : వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య అన్నారు. మండలంలోని బెండాలపాడు గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా తల్లాడ అటవీ రేంజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీల విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో తల్లాడ డిప్యూటీ రేంజర్ సురేష్, శివకుమార్, జాన్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా స్టాళ్లు

ట్రైబల్ మ్యూజియం పరిశీలనలో ఐటీడీఏ పీఓ రాహుల్



మ్యూజియంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలంఅర్బన్: గిరిజన తెగలకు సంబంధించి సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా స్టాళ్లు ఏర్పాటు చేసి, వారి కళాకృతులను అమ్మకాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియం అభివృద్ధిలో భాగంగా వెదురు కర్ర, మట్టితో కళాకృతుల తయారీపై కమిటీ సభ్యులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజనుల ఆచార, వ్యవహారాలు, సంప్రదాయ వంటకాలు తయారు చేసి విక్రయిస్తే జీవనోపాధి లభిస్తుందని తెలిపారు. మట్టితో ఇల్లు నిర్మించి, యాత్రికులు కూర్చునేలా వెదురుతో కుర్చీలు, సోఫాలు రూపొందించాలని, రెస్టారెంట్ కూడా వెదురుతోనే సిద్ధం చేయాలని చెప్పారు. అనంతరం ట్రైబల్ మ్యూజియంలో ఏర్పాట్లను పరిశీలించిన ఆయన సూచనలు చేశారు. కాగా, మాజీ ఎంపీ జి.వెంకటస్వామి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పీఓ, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏఓ సున్నం రాంబాబు, వివిధ విభాగాల అధికారులు మునీర్‌పాషా, ఉదయ్‌కుమార్, హరీశ్, అశోక్‌కుమార్, రమణయ్య, హరికృష్ణ, వీరస్వామి, నాగార్జునరావు, భాస్కరన్, రమణయ్య, అలివేలు మంగతాయారు, ఆదినారాయణ, డిజైనర్ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్‌ల్లోని విద్యార్థులకు గణితశాస్త్రం, ఆంగ్లం సులభంగా అర్థమయ్యేలా బోధించాలని పీఓ బి.రాహుల్ సూచించారు. వేదిక్ గణితం బోధిస్తున్న ఉపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ 3, 4, 5 తరగతుల విద్యార్థులకు గణితం, ఆంగ్లం బోధించే సమయాన త్వరగా అర్థమయ్యే విధానాలు పాటిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం వేదిక్ గణితం డైరెక్టర్ మురాహరి మాట్లాడగా ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ అశోక్‌కుమార్, జీసీడీఓ అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి

- ప్రజారోగ్య కార్యక్రమాలు విస్తృత పరచాలి
- హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్



భద్రాచలం ఆస్పత్రిలో వైద్యసేవలపై ఆరా తీస్తున్న రవీంద్రనాయక్

భద్రాచలంఅర్బన్/బూర్గంపాడు : వివిధ రకాల జబ్బులతో వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. శనివారం ఆయన భద్రాచలం ఏరియా ఆస్పత్రి, బూర్గంపాడు మండలంలోని ఎంపీ బంజర పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృత పరచాలని ఆదేశించారు. ఆయా ఆస్పత్రుల్లో రోగులతో మాట్లాడి, వైద్య సేవలపై ఆరా తీశారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు అందిస్తున్న చికిత్సలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సర్కార్ వైద్యాన్ని ప్రజల చెంతకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆయా సేవలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత వైద్యులు, సిబ్బంది పై ఉందని అన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్యపరచాలని, మలేరియా, డెంగీ కేసులు ప్రబలుతున్న నేపథ్యంలో మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో అత్యవసర వాహనాలు అందుబాటులో ఉంచాలని, అవసరమైన వసతులు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నివేదిక సమర్పించాలని సూచించారు. భద్రాచలం ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉందని సూపరింటెండెంట్ రామకృష్ణ చెప్పగా త్వరలో పూర్తి స్థాయి నియామకాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అంతకుముందు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు.

కాకా ఆశయ సాధనకు కృషి చేయాలి

కొత్తగూడెంరూరల్: కాంగ్రెస్ అగ్రనేత, దివంగత వెంకటస్వామి(కాకా) ఆశయ సాధనకు కృషి చేయాలని డీహెచ్ రవీంద్ర నాయక్ అన్నారు. స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కాకా జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వెంకటస్వామి రాజకీయ ప్రస్థానం భవన నిర్మాణ కార్మిక దశ నుంచి ప్రారంభమైందని, కార్మికుల సంక్షేమానికి ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, డీసీహెచ్ఎస్ రవిబాబునాయక్, డీఐఓ బాలాజీనాయక్, జిల్లా టీబీ అధికారి సాయికల్యాణ్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు చైతన్య, ఫైజ్ మొహియుద్దీన్, సుకృత, డీఈఎంఓ ఫియాజ్, వైద్యులు కళ్యాణ్, సంతోష్, లక్ష్మీసాహితి, మధువన్, సుదర్శన్, సింగోజి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సింగరేణి కళాశాలలో ఎన్‌పీటీఈఎల్ చాప్టర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్, డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నేషనల్ ప్రోగ్రాం ఫర్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్(ఎన్‌పీటీఈఎల్) లోకల్ చాప్టర్ ఏర్పాటు చేయనున్నట్లు సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. సింగరేణి విద్యాసంస్థల్లో దశల వారీగా సీబీఎస్ఈ విధానం అమలుచేయనుండగా, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ కళాశాలల్లోనూ విద్యార్థుల నైపుణ్యాల పెంపుపై సీఎండీ దృష్టి సారించని పేర్కొన్నారు. నూతన కోర్సులు కీలకపాత్ర పోషించనున్నందున అధ్యయనం చేయడానికి కొత్తగూడెంతో పాటు శ్రీరాంపూర్ కళాశాలల్లో నూతన చాప్టర్లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

జాబ్‌మేళాలో 21 మందికి ఉద్యోగాలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం బాబుక్యాంప్‌లో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు 32 మంది హాజరయ్యారని జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. వీరిని కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూ చేయగా 21 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఉద్యోగం సాధించిన వారికి హోదాను బట్టి నెలకు రూ.18 వేల నుంచి రూ. 25 వేల వరకు వేతనం అందుతుందని, సీఎంపీఎఫ్ ఉంటుందని వివరించారు. అదనంగా విధులు నిర్వర్తించిన వారికి అలవెన్స్‌లు చెల్లిస్తారని తెలిపారు.

ప్రశాంతంగా 'ఓపెన్' పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు జిల్లాలో శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్ పరీక్షకు 133 మందికి 108 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరు అయ్యారు. పదో తరగతిలో 146 మందికి 118 మంది హాజరు కాగా 28 మంది గైర్హాజరయ్యారని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన

కొత్తగూడెంఅర్బన్: డీఎస్సీ– 2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారంతో ముగిసింది. జిల్లాలో 447 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, 1:3 ప్రకారం 1,051 మందికి గాను 971 మంది హాజరయ్యారు. వారి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసి, వివరాలను ఆన్‌లైన్ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు.. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు పంపించారు. చివరి రోజు ఆన్‌లైన్ ప్రక్రియ రాత్రి వరకూ కొనసాగింది. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వం నియామక పత్రాలు అందించనుంది.

రామయ్యను దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రటరీ



రామాలయంలో సంజయ్‌కుమార్ తదితరులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారిని తెలంగాణ ఎంప్లాయ్‌మెంట్, ట్రైనింగ్ ఫ్యాక్టరీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్ కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి వేదాశీర్వచనం చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం సంజయ్‌కుమార్ కుటుంబసభ్యులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి జ్ఞాపికతో పాటు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సాయిబాబు, ఐటీసీ అధికారులు చెంగలరావు పాల్గొన్నారు.

'కిసాన్ సమ్మాన్ నిధి' ప్రసార వీక్షణ



ప్రత్యక్ష ప్రసారాన్ని చూస్తున్న రైతులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా శనివారం ప్రధాని నరేంద్రమోదీ విడుదల చేసిన నిధుల ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లాలోని పలువురు రైతులు వీక్షించారు. చిట్టిరామవరంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్. నవీన్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ శివ, ఏఓ రాజేశ్వరి తదితరులు రైతులకు కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. ఆ తర్వాత గ్రామంలో పత్తిపంటలను పరిశీలించి వివిధ పురుగులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌కు అటవీశాఖ ఉద్యోగులు



క్రీడా పోటీలకు బయలుదేరుతున్న అటవీ శాఖ ఉద్యోగులు

పాల్వంచరూరల్: హైదరాబాద్‌లోని దూల్‌పేట ఫారెస్ట్ అకాడమీలో ఆది, సోమవారాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్–2024కు అటవీశాఖ ఉద్యోగులు శనివారం తరలివెళ్లారు. జిల్లాలోని పాల్వంచ వైల్డ్‌లైఫ్ డివిజన్ నుంచి 17మంది, టెరిటోరియల్ డివిజన్ నుంచి 15మందితోపాటు మరో నాలుగు డివిజన్ల నుంచి సుమారు 80 మంది ఫారెస్ట్ ఉద్యోగులు రెండు బస్సుల్లో వెళ్లినట్లు వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ బి.బాబు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన ఉద్యోగులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

11న సీఎం కప్ ర్యాలీ

కొత్తగూడెంటౌన్: ముఖ్యమంత్రి కప్–2024 పోటీల్లో భాగంగా ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవిపల్లి సెంట్రల్ పార్కు నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు జరిగే టార్చ్ ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 3న హైదరాబాద్‌నుంచి బయల్దేరిన ర్యాలీ అన్ని జిల్లాలు తిరుగుతూ భద్రాద్రి కొత్తగూడేనికి ఈ నెల 11న గుండాల మండలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

మూడు మండలాలకు 25 వేల బతుకమ్మ చీరలు



బతుకమ్మ చీరలతో భద్రాచలం చేరుకున్న లారీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నియోజకవర్గం పరిధిలో ఉన్న భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల వ్యాప్తంగా బతుకమ్మ పండుగ సందర్భంగా 25 వేల బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నారు. శనివారం చీరలు భద్రాచలం చేరుకోగా, మండల పరిషత్ కార్యాలయంలో భద్రపరిచారు. భద్రాచలానికి 7 వేలు, దుమ్ముగూడేనికి 10 వేలు, చర్లకు 8 వేల బతుకమ్మ చీరలు వచ్చాయి. కాగా భద్రాచలం నియోజకవర్గంలో ఉన్న గిరిజన మహిళలకు మాత్రమే పంపిణీ చేయనున్నట్లు సమాచారం.

మృతుడి కుటుంబానికి తోటి కానిస్టేబుళ్ల అండ

- ఎస్పీ చేతుల మీదుగా రూ.2 లక్షల చెక్కు అందజేత



రమణారెడ్డి కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: ఇటీవల మృతి చెందిన కానిస్టేబుల్ రమణారెడ్డి కుటుంబానికి 2000 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు అండగా నిలిచారు. శనివారం కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో మృతుడి కుటుంబ సభ్యులకు ఎస్పీ రోహిత్‌రాజు చేతుల మీదుగా రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గుట్కాలు సీజ్

ఇల్లెందు: ఇల్లెందు–గుండాల రోడ్‌లో రొంపేడు చెక్ పోస్టు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అక్రమంగా ఆటోలో తరలిస్తున్న గుట్కాలను పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. గుండాల మండలం కాచనపల్లికి చెందిన నిందితుడు సకినాల సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

తండ్రిపై కుమారుడి దాడి

ఇల్లెందు: పట్టణంలోని కాకతీయ నగర్‌కు చెందిన సముద్రాల శ్రీనివాస్‌పై అతని కుమారుడు పవన్‌కల్యాణ్ శనివారం దాడి చేశాడు. తలకు తీవ్ర గాయం కావటంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ లింగయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోడి పందేల స్థావరంపై దాడి

దుమ్ముగూడెం : మండలంలోని జిన్నెలగూడెం గ్రామ శివారులో కోడిపందేల స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.4500 నగదు, రెండు కోడి పుంజులు, ఐదు కోడి కత్తులు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా మరికొందరు నిందితులు పరారయ్యారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గణేష్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

పండుగలకూ పస్తులేనా..?

అంగన్‌వాడీలకు అన్నీ ఇబ్బందులే
- పెండింగ్‌లో అద్దె, ఈవెంట్, గ్యాస్, ఆరోగ్యలక్ష్మి బిల్లులు
- పండుగ సమయంలోనైనా చెల్లించాలని డిమాండ్
- అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం



రామవరంలోని అంగన్‌వాడీ సెంటర్

కొత్తగూడెంటౌన్: పండుగ వస్తుంది ఖర్చులు ఉన్నాయని నెల జీతానికి చేస్తే.. నెల జీతంలో సగానికి పైగా అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకే పోతోందని, ఎదురుచూపులు తప్ప మరేమీ మిగలటం లేదని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 2 నుంచి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కాగా, 12వ తేదీన సద్దుల బతుకమ్మ ఉందని, ఈ పండుగకు కూడా పస్తులుండాలా? అని వారు వాపోతున్నారు. తమకు రావాల్సిన బకాయిలు ఇస్తే కష్టాలు తీరిపోతాయని, కానీ, అవి ఇంతవరకు విడుదల కాలేదని చెబుతున్నారు. అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణకు నెలజీతంలో నుంచే ఖర్చు చేయాల్సి వస్తోందని, ఇలా అద్దెలు నెలలుగా పెండింగ్‌లో ఉంటే ఎలా బతకాలని మండిపడుతున్నారు.

పండుగొస్తే బాధే..

బతుకమ్మ పండుగ వస్తుందంటేనే అందరి ఇళ్లల్లో ఆనందం నెలకొంటుంటే.. తమ ఇళ్లల్లో మాత్రం బాధ ఉంటోందంటున్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు రావాల్సిన అద్దె 10 నెలలుగా పెండింగ్‌లోనే ఉందని వారు చెబుతున్నారు. ఈవెంట్ బిల్లులు 4 ఏళ్లుగా, ఆరోగ్యలక్ష్మి ఏడాదిగా, గ్యాస్ బిల్లులు 6 నెలలుగా, సమ్మె వేతనంతో కలిపి అన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయని అంగన్‌వాడీలు చెబుతున్నారు. చాలాకాలంగా ఎదురుచూపులు తప్ప బకాయిలు చెల్లించడం లేదని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ బకాయిలన్నీ వస్తే తాము పండుగను ఘనంగా జరుపుకుంటామని, కానీ, అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. పెరిగిన వేతనాలు సైతం నాలుగు నెలలుగా పెండింగ్‌లోనే ఉన్నాయని వాపోతున్నారు.

అద్దె బకాయిలు ఎప్పుడొస్తాయో..?

ఐసీడీఎస్ పరిధిలో 11 మెయిన్ ప్రాజెక్టులు ఉండగా అంగన్‌వాడీ సెంటర్లు 2,060 ఉన్నాయి. 782 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా మరో 493 కేంద్రాలు ఉచిత భవనాల్లో కొనసాగుతున్నాయి. 785 కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఒక్కో సెంటర్‌కు ఆయా ప్రాంతాలను బట్టి రూ.1,000 నుంచి రూ.4 వేల వరకు అద్దెలు చెల్లించాల్సి ఉంది. విద్యార్థులను బట్టి ఒకటి, రెండు లేదా మూడు గదుల్లో నిర్వహణ కొనసాగుతోంది. ఈ 785 సెంటర్లకు 10 నెలలు అద్దె పెండింగ్‌లో ఉంది. ఈ బకాయిలు ఎప్పుడు విడుదల అవుతాయోనని అంగన్‌వాడీలు ఎదురుచూస్తున్నారు. ఇక ఐసీడీఎస్ పరిధిలో సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కోసం ఈవెంట్లు నిర్వహించగా కొంత ఖర్చు అవుతుంది. నెలకు రూ.500 వరకు ఖర్చు చేసినా ఇప్పటి వరకు ఒక అంగన్‌వాడీ సెంటర్‌కు సుమారుగా రూ.6 వేల నుంచి రూ.9 వేల వరకు రావాల్సి ఉంది. గ్యాస్ బిల్లు 6 నెలలుగా, ఆరోగ్యలక్ష్మి బిల్లులు, పెరిగిన వేతనాలు 4 నెలలుగా పెండింగ్‌లో ఉంది.

బకాయిలు వెంటనే చెల్లించాలి



అంగన్‌వాడీలకు అద్దె బిల్లులు, గ్యాస్, ఆరోగ్యలక్ష్మి, సమ్మె వేతనం, ఈవెంట్ బిల్లుల కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్నాం. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా బిల్లులు చెల్లించడం లేదు. ముందుగా ఖర్చు చేశాం. బిల్లులు రాకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు రావాల్సిన బిల్లులు తక్షణమే చెల్లించాలి.

–గోనె మణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, అంగన్‌వాడీ టీచర్ల అసోసియేషన్

త్వరలోనే అద్దె బకాయిలు..



అంగన్‌వాడీలకు రావాల్సిన అన్ని బకాయిల విషయంలో ఉన్నతాధికారులకు నివేదించాం. అంగన్‌వాడీ సెంటర్లకు రావాల్సిన ఈవెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో రావాల్సిన బిల్లులు ఆలస్యమయ్యాయి. గత ఆగస్టు వరకు బిల్లులన్నీ చెల్లించాం. ఆ తర్వాత బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని త్వరలోనే చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

–వేల్పుల విజేత, జిల్లా సంక్షేమశాఖ అధికారి

జీవీ మాల్ నూతన షోరూం ప్రారంభం

- షోరూంను ప్రారంభించిన మంత్రి తుమ్మల
- జ్యోతి ప్రజ్వలన చేసిన సినీనటి కీర్తి సురేశ్



షోరూంను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన యజమానులు గుర్రం ఉమామహేశ్వరరావు, వాసు, మురళి తదితరులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హీరోయిన్ కీర్తి సురేశ్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని వైరారోడ్‌లో జీవీ మాల్ నూతన షోరూం శనివారం ప్రారంభమైంది. కుటుంబమంతటికీ కావాల్సిన సరికొత్త డిజైన్లలో వస్త్రాలు ఒకే చోట లభించేలా ఈ షోరూంను 45 వేల అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఈ మేరకు షోరూంను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత ఖమ్మం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని తెలిపారు. జీవీ మాల్ యాజమాన్యం ఏళ్లుగా వస్త్ర రంగంలో పేరుగాంచారని చెప్పారు. ఆ తర్వాత సినీ హీరోయిన్ కీర్తి సురేశ్ జ్యోతి ప్రజ్వలన చేయగా షోరూంల్లోని వివిధ విభాగాలను పరిశీలిస్తూ సందడి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఖమ్మం తొలిసారిగా రావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఇప్పటికే జీవీ మాల్ షోరూంలకు ప్రజల ఆదరణ లభిస్తోందని, కొత్త షోరూంను సైతం అదే స్థాయిలో ప్రజలు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జీవీ మాల్ అధినేతలు గుర్రం ఉమామహేశ్వరరావు, గుర్రం వాసు, గుర్రం మురళి మాట్లాడుతూ.. నాణ్యత, విస్తారమైన రేంజ్, సరసమైన ధరలే తమ ఎదుగుదలకు సోపానాలని తెలిపారు. అపరిమితమైన శ్రేణి, అద్భుతమైన మోడళ్లు అన్ని వయస్సుల వారికి కావాల్సిన దుస్తులు, వస్త్రాలు లభిస్తాయని వెల్లడించారు. కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, హాస్యనటులు హైపర్ ఆది, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు వెంకటస్వామి



వెంకటస్వామికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జీవితమంతా నిస్వార్థంగా పనిచేసిన వెంకటస్వామి ఆదర్శప్రాయంగా నిలిచాడని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం వెంకటస్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. మొదట వెంకటస్వామి చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంకటస్వామి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో వివిధ శాఖల మంత్రిగా పనిచేసి ప్రజల మన్ననలను పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రమాదేవి, ఎల్‌బీఎం వెంకటరామిరెడ్డి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ రమేష్, డీఎం సివిల్ త్రినాథ్‌బాబు, ఏటీఓ శ్రీనివాసరావు, డి సెక్షన్ సూపరింటెండెంట్ యాసిన్ పాల్గొన్నారు.

బైక్, మినీ వ్యాన్ ఢీ : ఒకరికి గాయాలు

దమ్మపేట: మినీ వ్యాన్‌ను బైక్ ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డ సంఘటన మండలంలోని మందలపల్లి జంక్షన్ వద్ద శనివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... సత్తుపల్లి వైపు నుంచి వస్తున్న మినీ వ్యాన్ మందలపల్లి జంక్షన్ వద్ద అల్లిపల్లి వైపు మలుపు తిరుగుతోంది. ఈ క్రమంలో అశ్వారావుపేట నుంచి వస్తున్న బైక్ మినీ వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు దమ్మపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఖమ్మం తీసుకెళ్లారు.

కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వేమునూరు వెంకటేశ్వర్లు

పాల్వంచ: ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రూల్స్, కన్వర్షన్, పదోన్నతులు, ఇతర సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నామంటూ తప్పుడు వాగ్దానాలతో ముందుకు వస్తున్న కార్మిక సంఘాల పట్ల కార్మికుల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) రాష్ట్ర అధ్యక్షుడు వేమునూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబు సూచించారు. శనివారం కేటీపీఎస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగుల ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చాలని చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. 5,6 దశల కర్మాగారంలో ఫోర్‌మెన్, పీఏ పోస్టుల సంఖ్య అతి తక్కువగా ఉండటంతో ఉద్యోగులు చాలా కాలంగా ఒకే కేడర్‌లో ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. పోస్టుల మంజూరు కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం కేటీపీఎస్ 5,6 దశల రీజనల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేశబోయిన కోటేశ్వరరావు, కార్యదర్శిగా మడిపల్లి గోపి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాలోతు బిచ్చ, అడిషనల్ సెక్రటరీగా గుగులోతు గణపతిలను ఎన్నుకున్నారు. జెన్‌కో వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సుధీర్, దుర్గా అశోక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్ సేవల విస్తరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఇప్పటివరకు బస్టాండ్లకే పరిమితమైన లాజిస్టిక్ సేవలను మండల, గ్రామీణ ప్రాంతాలకు విస్తరించినట్లు లాజిస్టిక్స్ ఏటీఎం ఎ.పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 38 ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల ద్వారా తక్కువ ధరతో వేగంగా, భద్రంగా పార్సిళ్లు పంపించవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాక ఏపీలోని అన్ని ముఖ్యమైన పట్టణాలు, కర్ణాటకలోని బెంగళూరులో కూడా లాజిస్టిక్ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



బోల్తాపడిన బొలెరో ట్రాలీ వాహనం

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. గుండాల మండలం సాయినపల్లి గ్రామానికి చెందిన యువకులు ధాన్యం విక్రయించి పండుగ సామగ్రి, దుస్తులు కొనుగోలు చేసేందుకు బొలెరో ట్రాలీ వాహనంలో ఇల్లెందుకు బయలుదేరారు. మార్గమధ్యలో కొమరారం గ్రామం దాటాక వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాగబోయిన రాంబాబు, వాగబోయిన చరణ్‌లకు తీవ్రంగా, గోవర్ధన్, గౌతమ్ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఇల్లెందు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో రాంబాబు, చరణ్‌లను ఖమ్మం తరలించారు. కొమరారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సింగరేణి జీఎంల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆరుగురు జీఎంలను బదిలీ చేస్తూ శనివారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో కార్పొరేట్‌లోని ఐఅండ్‌పీఎం విభాగం జీఎం ఐనాల రవికుమార్‌ను కార్పొరేట్‌లోనే క్వాలిటీ మేనేజ్‌మెంట్ విభాగానికి బదిలీ చేశారు. ఎన్విరాన్‌మెంట్ జీఎం ఎ.మనోహర్‌ను జీఎం (సీపీపీ)గా, క్వాలిటీ మేనేజ్‌మెంట్ జీఎం ఆర్.నారాయణరావును ఆర్జీ జీఎంగా, ఆర్జీ జీఎం బానోత్ సైదులును ఎన్విరాన్‌మెంట్ జీఎంగా, ఎంపీ విభాగం జీఎం ఎం.విజయ భాస్కర్ రెడ్డిని కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ జీఎంగా, ఎంపీ విభాగంలోని మరో జీఎం బానోత్ శ్రీనివాస్‌రావును ఐఅండ్ పీఎం జీఎంగా బదిలీ చేశారు.

నలుగురు సెక్యూరిటీ అధికారులు..

సింగరేణిలో వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న నలుగురు సెక్యూరిటీ అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీచేసింది. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సెక్యూరిటీ ఆఫీసర్, డిప్యూటీ జీఎం నైనీ ఉమాకాంత్‌ను బెల్లంపల్లి ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్‌గా, శ్రీరాంపూర్ టింబర్‌యార్డ్‌లో అడిషనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఎస్.జక్కిరెడ్డిని శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ సిలువేరి మురళిమోహన్‌ను భూపాలపల్లికి, అక్కడి సెక్యూరిటీ ఆఫీసర్ టి.రవిని శ్రీరాంపూర్ ఏరియా ఓసీ–2కు బదిలీ చేశారు.

పింఛన్ డబ్బుల కోసం వృద్ధుడి వేడుకోలు



బాధిత వృద్ధుడు గోపయ్య

చంద్రుగొండ : ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పింఛన్ సొమ్ము తీసుకోకుండా బ్యాంకు మేనేజర్ తన ఖాతాను హోల్డ్‌లో పెట్టారని ఓ వృద్ధుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ ఉదంతం వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారడంతో చర్చనీయాంశమైంది. చంద్రుగొండ మండలం రావికంపాడు గ్రామానికి చెందిన వృద్ధుడు రెడ్డిపోగు గోపయ్యకు చంద్రుగొండలోని ఏపీ జీవీబీ శాఖలో నెలవారీ పింఛన్ నగదు జమ అవుతోంది. అతని పేరు మీద వ్యవసాయ రుణం పెండింగ్ ఉండటంతోపాటు అతడి కోడలు కరుణమ్మ పేరున డ్వాక్రా రుణం ఉండటంతో బ్యాంక్ అధికారులు పింఛన్ అకౌంట్‌ను హోల్డ్‌లో పెట్టారని వృద్ధుడు ఆరోపిస్తున్నాడు. దీంతో కొన్ని నెలలుగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నాడు. ఈ విషయమై ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ రవికుమార్‌ను వివరణ కోరగా.. గోపయ్య అకౌంట్‌ను తాము హోల్డ్‌లో పెట్టలేదని, ప్రస్తుతం ఆయన అకౌంట్‌లో డబ్బులు లేవని తెలిపారు.

102 వాహనంలో తరలిస్తున్న కలప స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న అటవీశాఖ అధికారులు

దుమ్ముగూడెం : మండలంలోని జిన్నెలగూడెం గ్రామం నుంచి 102 ప్రభుత్వ వాహనంలో భద్రాచలం తరలిస్తున్న టేకు దిమ్మలను దుమ్ముగూడెం పోలీసులు పట్టుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం... సీఐ అశోక్ తన సిబ్బందితో చిన్ననల్లబల్లిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో 102 వాహనం ఆపకుండా వెళ్లగా, పోలీసులు వెంబడించారు. దీంతో రాయిగట్ట గ్రామ సమీపంలో వాహనం నిలిపి డ్రైవర్ పరారయ్యాడు. వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వాహనంతోపాటు స్టేషన్‌కు తరలించారు. అనంతరం అటవీశాఖ అధికారులకు వాహనాన్ని అప్పగించగా, వారు భద్రాచలం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. వాహనంలోని 7 టేకు దిమ్మలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.85 వేల వరకు ఉంటుందని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేశామని, పరారీలో ఉన్న డ్రైవర్ కోసం గాలింపు చేపట్టామని పేర్కొన్నారు.

సినిమా థియేటర్ ధ్వంసం ఘటనలో కేసు నమోదు

పాల్వంచ: దేవర సినిమా విడుదల సందర్భంగా కొందరు వ్యక్తులు సినిమా థియేటర్‌ను ధ్వంసం చేసిన ఘటనలో శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర థియేటర్‌లో గత నెల 27న బెన్‌ఫిట్ షో ప్రదర్శన సమయంలో ప్రొజెక్టర్‌లో సాంకేతిక సమస్య తలెత్తి ఆలస్యమైంది. ఈ క్రమంలో చంద్ర రవి, కృష్ణ, గోపి అనే వ్యక్తులు ప్రేక్షకులను రెచ్చగొట్టారు. దీంతో అక్కడి సిబ్బంది షేక్ ఖదీర్, వాంకుడోతు లక్‌పతి, శీలం నవీన్‌రెడ్డి, రుంజ వెంకటేశ్వర్లుపై పలువురు దాడి చేశారు. బూతులు తిట్టారు. థియేటర్ అద్దాలు పగులగొట్టారు. సామగ్రి ధ్వంసం చేశారు. రూ. 4 లక్షల నష్టం జరిగిందని శనివారం థియేటర్ మేనేజర్ జంపాల స్వామి పోలీసులకు ఫిర్యాదు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

వరకట్న వేధింపులపై..

భద్రాచలంఅర్బన్: వరకట్న వేధింపులపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన బొగ్గుల భవానికి 2010లో శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తితో వివాహం జరిగింది. అయితే నాలుగేళ్లుగా భవానిని ఆమె భర్త, అత్తామామలు అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పీవీఎన్ రావు తెలిపారు.

పశువులు తరలిస్తున్నవారిపై..

టేకులపల్లి: అక్రమంగా పశువులు రవాణా చేస్తున్న నలుగురిపై శనివారం కేసు నమోదు చేశారు. బొలెరో వాహనంలో 8 ఆవులను అక్రమంగా తరలిస్తుండగా వాహన తనిఖీలు చేపట్టిన పోలీసుల పట్టుకున్నారు. నిందితులు బేతంపూడికి చెందిన శ్యామ్, నరేష్, పాల్వంచకు చెందిన ఖాసీం, ఇల్లెందుకు చెందిన మోబీన్‌లపై కేసు నమోదు చేశారు. పశువులను పాల్వంచ గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ పి.సురేస్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

అధికారుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన



గూని ప్రసాద్ (ఫైల్)

చింతకాని: ఇటీవల ఈదురుగాలులకు తెగిపడిన విద్యుత్ తీగలను తాకిన రైతు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే, ఈ ప్రమాదానికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ ఆయన బంధువులు సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. రెండు రోజుల కిందట వచ్చిన ఈదురుగాలులకు మండలంలోని లచ్చగూడెంకు చెందిన రైతు గూని ప్రసాద్ (57) సోదరుడి పొలంలోని భారీ వృక్షం నేలకూలడంతో విద్యుత్ తీగలు తెగి పొలంలో పడ్డాయి. ఈ విషయమై అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని తెలుస్తోంది. దీంతో శనివారం ఉదయం తన సోదరుడి పొలంలో పురుగు మందు పిచికారీ చేసేందుకు వెళ్లిన ప్రసాద్ తెగిపడిన విద్యుత్ తీగలను తాకి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపాన ఉన్న ఆయన సోదరులు గూని అప్పారావు, వెంకటేశ్వర్లు అప్రమత్తమై ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి సరఫరా నిలిపివేశారు. కాగా, విద్యుత్ తీగలు తెగి పడ్డాయని అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ప్రసాద్ మృతి చెందాడని ఆరోపిస్తూ బంధువులు కొదుమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, వైరా సీఐ సాగర్, డీఈ రామారావు, ఏఈ వెంకన్న, ఎస్‌ఐ నాగుల్‌మీరా చేరుకుని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, ప్రసాద్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉండగా.. ఆందోళనలో పెద్దసంఖ్యలో బంధువులు, గ్రామస్తులు పాల్గొనడంతో ఖమ్మం ఏసీపీ రమణారెడ్డి ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేశారు.